ఆంధ్రభూమి
బుధవారం 25 డిసెంబర్ 2013



## హైదరాబాద్

# యశోద ఆసుపత్రిలో 'గుండెమార్పిడి' విజయవంతం



గుండెమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా చేసుకున్న రమ్య, యశోద ఆసుపత్రి ఎండి డా.జిఎస్ రావుతో వైద్య బృందం

బేగంపేట, డిసెంబర్ 24: యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గుండెమార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి అరుదైన ఘనత సాధించింది. అతి చిన్నవయస్సురాలైన ఓ మహిళకు గుండెమార్పిడిచేసి కేవలం 10 గంటల్లోనే ఆమె మాట్లాడేలా చేశారు. మంగళవారం సికిందరాబాద్ యశోదా హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.జిఎస్ రావు నేతృత్వంలో శస్త్రచికిత్స నిర్వహించిన కార్డియోథొరాసిక్, ట్రాన్స్‌ప్లాంట్, మినిమల్ యాక్సెస్ సర్జన్ డా.ఎజె గోఖలే కలిసి వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన వెంకటరమ్య (25) ఏడు సంవత్సరాల క్రితం ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు గుండె సమస్య మొదలైంది. రెండు నెలల క్రితం రమ్య యశోదా హాస్పిటల్‌లో గోఖలేను సంప్రదించారు. కార్డియాలజిస్టు డా.రాజశేఖర్ ఆమెకు వివిధ పరీక్షలు నిర్వహించి గుండె మార్పిడితో ఆమెను ఆరోగ్యవంతురాలుగా చేయగలమనే నిర్ధారణకు వచ్చారు. ఈ నెల 15వ తేదీన 21 ఏళ్ల వ్యక్తి ప్రమాదానికి గురై నగరంలో ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో బ్రెయిన్‌డెడ్ పరిగణించారని సమాచారం అందుకున్న జీవన్‌దాన్ ప్రముఖులు ఈ విషయాన్ని యశోద ఆసుపత్రికి తెలియజేశారు. హాస్పిటల్ వైద్యులు అతని గుండెన వెంటనే రమ్యకు అమర్చేందుకు సన్నాహాలు చేశారు. అంతా పకడ్బందీగా ఏర్పాటు చేసుకున్న వైద్యులు పోలీసు ఎస్కార్ట్ సాయంతో పది నిమిషాల వ్యవధిలో గుండెను తీసుకువచ్చి రమ్యకు శస్త్రచికిత్సద్వారా అమర్చారు. ఈ ఆపరేషన్‌లో డా.విశ్వనాథ్, డా.దిలీప్‌లాఠి, డా.సుబ్రహ్మణ్యం, డా.సుధాకర్, మాధవ్, సాయిచంద్ర పాల్గొని రెండు గంటల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసి రక్త సరఫరాను పునరుద్ధరించారు.